క్లుప్తంగా

శ్రీనివాసరెడ్డికి ఇన్‌స్పైరింగ్ లీడర్స్ అవార్డు



శ్రీనివాసరెడ్డికి అవార్డు అందిస్తున్న క్రికెటర్ హర్భజన్ సింగ్

తగరపువలస: స్థానిక వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాసరెడ్డికి ముంబయిలో టైమ్స్ ఆఫ్ లాడ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఇన్‌స్పైరింగ్ లీడర్స్ – 2023 అవార్డును క్రికెటర్ హర్భజన్ సింగ్ చేతుల మీదుగా ఆదివారం అందించారు. సోషల్ సర్వీస్‌లో బెస్ట్ యాక్టివిస్ట్‌గా ఈ గుర్తింపు లభించినట్టు శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన సేవా కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న స్నేహితులు, దాతలు, భీమిలి నీడీ వెల్ఫేర్ కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న భీమిలి పోలీసులు

తగరపువలస: చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో శనివారం రాత్రి రోడ్డు దాటుతున్న రిక్క తాత (74)ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. భోగాపురం మండలం కొత్త చెరకుపల్లికి చెందిన తాత హైవేలో ఒక దుకాణం వద్ద సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తుండేవాడు. విధులకు హాజరయ్యేందుకు వచ్చిన తాతను విజయనగరం నుంచి విశాఖవైపు వెళ్లే వాహనం ఢీకొనడంతో మృతి చెందినట్టు అతని మనమడు తోగులురెడ్డి భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భీమిలి ఎస్‌ఐ గంటా హరీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథ స్వామి

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు. అదేవిధంగా శ్రీ కృష్ణాష్టమిని పురస్కరించుకుని సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



సాగర కనకదుర్గ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న భక్తులు

పద్మనాభం: మండలంలోని మద్ది జంక్షన్‌కు సమీపంలో ఆదివారం సాగర కనక దుర్గ ఆలయ నిర్మాణానికి కనకల చిన్నంనాయుడు, లక్ష్మి దంపతులు భూమి పూజ చేశారు. వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, సర్పంచ్ బుగత సన్యాసమ్మ పూజలు చేశారు. పురోహితులు బదిరికా వాసుదేవ్ శాస్త్రోక్తంగా పూజలు చేశారు.

హైవే దాటాలంటే కష్టమే

- ప్రమాదాల నియంత్రణకు గ్రిల్స్ ఏర్పాటు
- మధురవాడ బస్ షెల్టర్‌కు చేరడానికి అష్టకష్టాలు
- వృద్ధులు, మహిళలు, పిల్లలకు ఇబ్బందులు



మధురవాడలో హైవే దాటడానికి అవస్థలు పడుతున్న ప్రయాణికులు



హైవేపై రెయిలింగ్ దాటడానికి అవస్థలు పడుతున్న దంపతులు



బస్ షెల్టర్‌కు అడ్డంగా ఉన్న ఐరన్ గ్రిల్స్

మధురవాడ: జీవీఎంసీ జోన్ – 2 కేంద్రం మధురవాడలో ప్రయాణికులు, ప్రజలు హైవే దాటడానికి అష్టకష్టాలు పడుతున్నారు. మధురవాడ ప్రధాన జంక్షన్, చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేదా అండర్ పాస్ నిర్మించాలని అంతా కోరుతుంటే అధికారులు ఆ దిశగా కనీస చర్యలు చేపట్టడం లేదు. మరోవైపు సునాయాసంగా రోడ్డు దాటడానికి కూడా వీలు లేకుండా చేసేశారు. దీంతో ఇక్కడి ప్రజలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి హైవేపై బ్రిడ్జి నుంచి జీవీఎంసీ వరకు 100 మీటర్లు పైనే సెంటర్ డివైడర్‌పై అధికారులు ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు, పాదచారులు, విద్యార్థులు రోడ్డు దాటడానికి అవస్థలు పడుతున్నారు. మరికొంత మంది హైవేలోనే కొంత దూరం రాంగ్ రూట్లో నడిచి రోడ్డు దాటుతున్నారు. ఇది మరింత ప్రమాదకరంగా మారింది. ఇటీవల ఇక్కడ సిగ్నల్స్ అందుబాటులోకి తెచ్చారు. రోడ్డుపై జీబ్రా మార్కులు ఏర్పాటు చేశారు. అయినా ప్రయోజనం శూన్యం. రోడ్డు దాటడానికి అవస్థలు ఎక్కువయ్యాయని స్థానికులు వాపోతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి బస్సు స్టాపు వద్ద రోడ్డు దాటడానికి వీలుగా గ్యాప్ ఉంచి, పోలీసు బందోబస్తు మరింత పెంచి, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

273 మందికి పింఛన్ల మంజూరు



పింఛన్ నగదు అందిస్తున్న సచివాలయ సిబ్బంది

మధురవాడ: భీమిలి నియోజకవర్గ పరిధిలోని జీవీఎంసీ జోన్ – 2లోని 4 వార్డుల్లో కొత్తగా 273 మందికి పింఛన్లు మంజూరైనట్టు జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి చెప్పారు. లబ్ధిదారులకు పింఛన్ల నగదు పంపిణీ చేశామని తెలిపారు. వైఎస్సార్ పెన్షన్ కానుక కింద 5వ వార్డులో 61 మందికి, 6వ వార్డులో 95, 7వ వార్డులో 64, 8వ వార్డులో 53 మందికి మంజూరైనట్లు తెలిపారు. ఈ మేరకు జోన్‌లోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం కూడా వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్‌లు, వలంటీర్లు నగదు పంపిణీ చేశారు. మారికవలస ఆర్‌జీకే కొత్త కాలనీ 76వ వార్డు సచివాలయం పరిధిలో సచివాలయ కన్వీనర్ కల్లేపల్లి శంకరరావు, వలంటీర్ సౌజన్య, ఇతర ప్రాంతాలలో కన్వీనర్ లక్ష్మి, వలంటీర్ లక్ష్మణరావు పింఛన్లు పంపిణీ చేశారు.

సత్రం భూమి వేలం నేడు

భీమునిపట్నం: భీమిలిలోని దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన గంధం రామస్వామి సత్రం స్థలాన్ని వేలం వేయనున్నారు. ఇక్కడ చిన్నబజారు జంక్షన్ సమీపంలో 14 సెంట్ల ఖాళీ స్థలం ఉంది. ఈ స్థలాన్ని వివిధ వ్యాపారాల నిర్వహణకు వినియోగించుకునేలా వేలం వేయడానికి అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం ఉదయం పది గంటలకు దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష ఆధ్వర్యంలో వేలం వేయనున్నామని, ఆసక్తి గల వారు పాల్గొనవచ్చని నూకాలమ్మ వారి గ్రూప్ దేవాలయాల ఈవో బి.మురళీమోహన్ తెలిపారు.

అయ్యప్ప మహా సంగమ పూజ విజయవంతం చేయండి



అయ్యప్ప ధర్మప్రచార సభ రాష్ట్ర అధ్యక్షుడు ఆదిమోహన్ రెడ్డిని సన్మానిస్తున్న గురుస్వాములు

తగరపువలస: నగరంలో నవంబర్ 24 నుంచి మూడు రోజులపాటు నిర్వహించే అయ్యప్ప మహా సంగమ పూజను భక్తులంతా జయప్రదం చేయాలని అఖిల భారత అయ్యప్ప ధర్మప్రచార సభ రాష్ట్ర అధ్యక్షుడు పైల ఆదిమోహన్ రెడ్డి కోరారు. ఎంఎఫ్‌సీ యోగా సెంటర్‌లో భీమిలి నియోజకవర్గ గురుస్వాములతో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. దక్షిణ భారతదేశంలో మొదటిసారిగా విశాఖలో జరగనున్న ఈ పూజా కార్యక్రమాల విశేషాలను వివరించారు. శబరిమలైలోని ప్రధాన తంత్రి, 12 మంది నంబూద్రిలు, మేల్ శాంతులతోపాటు పందలరాజు వంశీయులు విలక్కు వంటి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ గాయకుడు వీరమణిరాజ్ ఆధ్వర్యంలో అయ్యప్ప భజన గీతాలు ఆలపిస్తారన్నారు. ఈ పూజలో ప్రతి ఒక్కరు పాల్గొని స్వామి ఆశీస్సులు పొందాలని సూచించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నాగార్జున, ఫణీంద్రస్వామి, కృష్ణయ్యస్వామి, రాజేష్, గురుస్వాములు ఆదిమూలం నాగరాజు, గాడు తాతినాయుడు, మాల్యాద్రి, కదిరి జగన్నాథం, నీలాపు సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపం వెలగక అవస్థలు



సంతపేట రెడ్డివీధిలో వెలగని వీధి దీపం

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు రెడ్డి సంతపేటలోని 96/ఎ/4/1 వీధి దీపం రెండు వారాలుగా వెలగకపోవడంతో చుట్టుపక్కల వారు ఇబ్బంది పడుతున్నారు. కొండవాలు శివారులో ఉన్న ఈ వీధి దీపం వెలగక విష పురుగులు, వీధి కుక్కలు ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చీకటి కారణంగా చిన్నచిన్న దొంగతనాలు జరుగుతున్నాయని అంటున్నారు. ఇటీవల ఆదర్శనగర్ సచివాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు కాకి ఎల్లాజీ, కొండపు సూరిబాబు, బండారు రామకృష్ణ, ఎం.నిఖిల్, మోక్షిరామ్ తదితరులు వాపోయారు. వెంటనే ఈ వీధి దీపాన్ని పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు.

గద్దర్‌కు ప్రజాసంఘాల నివాళి



గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తగరపువలస: ప్రజా గాయకుడు గద్దర్‌కు భీమిలి ప్రజా సంఘాల నాయకులు ఆదివారం సాయంత్రం నివాళులర్పించారు. చిట్టివలస సిటు కార్యాలయం వద్ద నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన బడుగు, బలహీనవర్గాలకు అందించిన సేవలను గుర్తు చేశారు. ఆయన బాటలో తామంతా నడవాలని నిర్ణయించారు. కార్యక్రమంలో అల్లు బాబూరావు, ఉప్పాడ అప్పారావు, ఆర్‌ఎస్ఎస్ మూర్తి, కానూరి రాంబాబు, బెల్లాన రామకృష్ణ, నీలాతి రాము, పల్లా పోతురాజు, దల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్నకు ఆర్జిత సేవలు



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలని వేదికపై అధిష్టంపజేసి విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం నిర్వహించారు .అనంతరం 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేసి విశేషంగా హారతులు అందజేశారు. • శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30గంటల నుంచి నిత్య కల్యాణం ఘనంగా నిర్వహించారు. కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

అలంకారప్రాయంగా డిజిటల్ బోర్డు



మధురవాడ రైతు బజార్‌లో అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్న డిజిటల్ బోర్డు

మధురవాడ: కొమ్మాది జంక్షన్ సమీపంలో ఉన్న మధురవాడ రైతు బజార్‌లో ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డు రెండేళ్లుగా పనిచేయక అలంకారప్రాయంగా దర్శనమిస్తోంది. లక్షన్నర వరకు జనాభా ఉన్న మధురవాడ ప్రాంతంలో గల రైతు బజార్‌లో వినియోగదారులకు కూరగాయల ధరలు ఎప్పటికప్పుడు తెలియజేయడానికి ఈ బోర్డు ఎంతో ఉపయుక్తంగా ఉండేది. బజార్‌లో చేతి రాతతో ఏర్పాటు చేసిన బోర్డులు సక్రమంగా కనిపించకపోయినా, చెరిగిపోయినా ధరలు తెలుసుకోవడానికి ఈ బోర్డు ఉపయోగపడేది. కానీ వేలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసినప్పటికీ నిర్వహణ లేక మూలకు చేరిపోయింది. దీనిని ఉపయోగంలోకి తీసుకురావాలని వినియోగదారులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఈవో జగదీష్ తెలిపారు.

రక్షిత మంచినీటి పథకం మెట్లు శిథిలం



మూలకుద్దు పంచాయతీ ఎస్సీ కాలనీలో మెట్లు, రెయిలింగ్ శిథిలమైన మంచినీటి పథకం

తగరపువలస: భీమిలి మండలం మూలకుద్దు పంచాయతీ ఎస్సీ కాలనీలో సుమారు 120 కుటుంబాల దాహార్తిని తీర్చే రక్షిత మంచినీటి పథకం మెట్లు, రెయిలింగ్ శిథిలమైపోయి ముక్కలు ఊడిపోయాయి. దీంతో ఈ కాలనీలో రక్షిత మంచినీటి పథకం శుభ్రత పనులు దాదాపుగా నెలల తరబడి నిలిచిపోయాయి. ఫలితంగా బోరు నుంచి పంపింగ్ అవుతున్న నీటినే నేరుగా ఇక్కడి ప్రజలు తాగుతున్నారు. నిర్ణీత సమయం ప్రకారం రక్షిత మంచినీటి పథకం శుభ్రం చేయాల్సి ఉన్నా ట్యాంకు వద్దకు చేరుకునే అవకాశం లేకుండా పోయింది. అలాగే ఈ రక్షిత మంచినీటి పథకానికి సరఫరా చేసే పైప్‌లైన్ చిట్టివలస – చిల్లపేట చెరువు వద్ద తుప్పు పట్టి లీకవుతున్న కారణంగా కూడా తాగునీరు కలుషితం అవుతోందని ఎస్సీ కాలనీ ప్రజలు వాపోతున్నారు. ట్యాంక్‌కు మరమ్మతులు నిర్వహించాలని కోరుతున్నారు.

6వ వార్డులో ఫాగింగ్

కొమ్మాది: డెంగ్యూ, మలేరియా కట్టడికి చేపడుతున్న చర్యల్లో భాగంగా జీవీఎంసీ 6వ వార్డులో మలేరియా నివారణ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల నుంచి ఫాగింగ్ ప్రక్రియ చేపట్టారు. ఇందులో భాగంగా ఆదివారం కొమ్మాది, ఎస్సీ కాలనీ ప్రాంతాల్లో జీవీఎంసీ సిబ్బంది మెగా ఫాగింగ్ నిర్వహించారు. దోమల వ్యాప్తి తగ్గించడానికి సాయంత్రం వేళల్లో చేస్తున్న ఫాగింగ్ ఉపయోగ పడుతుందని, ప్రతి ఇంటి పరిసరాల్లో నీటిని నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు.

మద్యం మత్తులో తూలిపడి వ్యక్తి మృతి

పరవాడ: చినతాడి గ్రామంలో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి మద్యం మత్తులో కింద పడి మృతి చెందాడు. అతుడు ఒడిశా రాష్ట్రం కలహండి జిల్లా భార్గన్ ప్రాంతానికి చెందిన రమేష్ పరిచా(46)గా గుర్తించారు. చినతాడి గ్రామంలో స్నేహితులతో నివాసం ఉంటున్నాడు. ఫార్మాసిటీలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొన్నాళ్లుగా పరిచా మద్యానికి బానిసై ఊగుతూ జోగుతూ ఉంటున్నాడు. స్నేహితులను కూడా పట్టించుకోవడం మానేశాడు. ఇదే క్రమంలో శనివారం ఉదయం తన తోటి స్నేహితులు కంపెనీలో విధులకు వెళ్లిపోయారు. పరిచా మాత్రం ఉదయం నుంచి తాగుతూ రాత్రి నివాసం ఉంటున్న ప్రదేశంలో అరుగుపై నిద్ర పోయాడు. అరుగుపై నుంచి కింద నున్న రాళ్లపై పడడం వల్ల తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం ఉదయం నిద్ర లేచిన స్నేహితులు పరిచా మృతి చెందినట్లు గుర్తించి పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ మల్లేశ్వరరావు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బంధువులకు సమాచారం అందించారు.

పేకాట ఆడుతున్న ఐదుగురి అరెస్ట్

భీమునిపట్నం: భీమిలి కృష్ణాకాలనీ కొండపై పేకాట ఆడుతున్న ఐదుగురిని ఆదివారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. ఇక్కడ ఉన్న ఒక చెట్టు కింద వీరు పేకాడుతున్నట్లు ఎస్‌ఐ భరత్‌కుమార్‌రాజు సమాచారం అందుకుని అరెస్ట్ చేశారు. వారి వద్దనున్న రూ.16,660 నగదు స్వాధీనం చేసుకున్నారు.

వినాయక చవితికి ఉత్సవ రాట



వైఎస్సార్ నగర్‌లో ఉత్సవ రాట వేస్తున్న కమిటీ సభ్యులు



తాతా థియేటర్ వద్ద ఉత్సవరాట వేస్తున్న భక్తులు

తగరపువలస: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్థానిక తాతా థియేటర్ డౌన్ గొల్లవీధిలో సూపర్ కింగ్స్ యూత్ ప్రతినిధులు ఆదివారం ఉత్సవరాట వేశారు. తొమ్మిది రోజులపాటు ఇక్కడ ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ప్రతినిధులు తెలిపారు. ఏడిద కార్తీక్ శర్మ పూజలు చేశారు. కంచుమాని వెంకటరావు, నీలాతి రాము, శివ, మణి, శ్యామ్, గంగరాజు, శ్రీను, కె.నరసింగరావు, మహేష్, పవన్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ: గణపతి నవరాత్రి ఉత్సవాల సందడి ప్రారంభమయ్యింది. ఈ నెల 18న జరిగే చవితి ఉత్సవాలకు జీవీఎంసీ 5వ వార్డు కొమ్మాది జంక్షన్ సమీపంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ వైఎస్సార్ కాలనీలో యువకులు ఆదివారం ఉత్సవరాట వేశారు. పూజలు నిర్వహించి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు.

రోడ్లు, కల్వర్టులకు రూ.20 లక్షల మంజూరు



పీపీ 2 కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు మారికవలస – తిమ్మాపురం రోడ్డులోని జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ పీపీ 2 కాలనీలో రోడ్లు, కల్వర్టుల నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరైనట్లు జేసీఎస్ కన్వీనర్ పోతిన సురేష్‌కుమార్ చెప్పారు. ఈ మేరకు ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ఉదయం కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడ కొన్నాళ్ల క్రితం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారం కోసం మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు వినతి మేరకు ఎమ్మెల్యే నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు. పనులు త్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు. భీమిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ జేఎస్ రెడ్డి, సచివాలయ కన్వీనర్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు రుషికేష్, ప్రసన్న, వాసు, మహాలక్ష్మి, నాయుడు, ఆది, లక్ష్మి, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇటుకుల వ్యాన్ బోల్తా



బోల్తాపడిన ఇటుకుల వ్యాన్ వద్ద స్థానికులు

ఆనందపురం : మండలంలోని నీళ్ల కుండీలు – పద్మనాభం మార్గంలో రేగానిగూడెం వద్ద ఆదివారం ఇటుకుల వ్యాన్ బోల్తా పడిన సంఘటనలో ఓ వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. పెద్ద ప్రమాదం తప్పింది. పద్మనాభం మండలం మద్దిలో ఇటుకుల లోడు వేసుకొని వ్యాన్ బయలుదేరింది. ఆ వ్యాన్ రేగానిగూడెం వద్దకు చేరుకునే సరికి అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో ఇటుకల లోడుపై కూర్చున్న వ్యక్తి గాయపడ్డాడు. డ్రైవర్, మరో వ్యక్తి క్షేమంగా బయటపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు గాయపడిన వ్యక్తిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. సంఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

నిందితులను అరెస్ట్ చేయాలని ఆందోళన



పద్మనాభం పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న మాజీ సైనికులు

పద్మనాభం: మండలంలోని రేవిడి పంచాయతీ రౌతులపాలెం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు మోపాడ ఆదినారాయణపై హత్యా యత్నానికి పాల్పడిన నిందితులను తక్షణమే అరెస్ట్ చేయాలని మాజీ సైనికులు ఆదివారం పద్మనాభం పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. నిందితులపై పోలీసులు సాధారణ సెక్షన్లతో కేసు నమోదు చేయడం అన్యాయమని, హత్యాయత్నంగా నమోదు చేయాలని నినాదాలు చేశారు. ఆదినారాయణపై హత్యా ప్రయత్నం జరిగి పది రోజులు దాటిపోతున్నా పోలీసులు నిందితులను అరెస్ట్ చేయలేదని మాజీ సైనికులు మండిపడ్డారు. నిందితులను తక్షణమే అరెస్ట్ చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని తెలిపారు. మాజీ సైనికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పూర్ణ చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల నిలయంగా ఆదర్శనగర్



నివాసాల మధ్య నిలిచిన మురుగునీరు



ఆదర్శనగర్‌లో మార్గ మధ్యలో తుప్పలు

తగరపువలస: సుమారు 30 ఏళ్ల కిందట ఏర్పడిన జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు ఆదర్శనగర్‌లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ప్రారంభంలో భీమిలి మున్సిపాల్టీలో ఉన్న ఈ గ్రామం ప్రస్తుతం జీవీఎంసీలో ఉంది. గతంలో ఇక్కడ ఇళ్ల స్థలాలు కొనుక్కున్నవారికి సరైన రహదారులు లేక భవన నిర్మాణ మెటీరియల్ రావడానికి అవకాశం లేకుండా పోయింది. మున్సిపాల్టీగానీ, జీవీఎంసీ గానీ పూర్తి స్థాయిలో రహదారులు, డ్రైనేజీలు నిర్మించలేదు. ఈ కారణంగా ఆదర్శనగర్ గ్రామం మధ్యలో కాలిబాటలే చాలామందికి రాకపోకలకు ఆధారంగా ఉన్నాయి. డ్రైనేజీలు లేక మురుగు ఊరి మధ్యలో రోజుల తరబడి నిల్వ ఉంటుంది. వర్షం కురిస్తే చెరువులను తలపిస్తున్నాయి. ఇక ఖాళీ స్థలాల్లో తుప్పలు పెరిగి మినీ అడవిని తలపిస్తోంది. విషపురుగులు వృద్ధి చెంది ఇళ్లలోకి ప్రవేశిస్తుండగా స్థానికులు మురుగులో నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. ఈ గ్రామంలో మురుగును బయటకు పంపించడంతోపాటు తుప్పలు తొలగించాలని ఆదర్శనగర్ వాసులు కోరుతున్నారు.

కొత్త విద్యుత్ కనెక్షన్లకు సచివాలయంలో రిజిస్ట్రేషన్లు

ఆనందపురం : కొత్త విద్యుత్ కనెక్షన్ల కోసం వినియోగదారులు ఆయా సచివాలయాల్లో దరఖాస్తులు సమర్పించి రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని మండల ఏఈఈ సురేష్ కుమార్ తెలిపారు. ఇంత వరకూ మండల సబ్ స్టేషన్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించి కనెక్షన్లు మంజూరు చేసేవారిమని... ఇక నుంచి పారిశ్రామిక, గృహ అవసరాలు, వ్యవసాయ మోటర్ల కనెక్షన్ల కోసం లబ్ధిదారులు అవసరమైన పత్రాలతో సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి మంజూరు చేస్తామని, వినియోగదారులు గమనించాలని ఏఈఈ సురేష్ కుమార్ కోరారు.